www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -252 మంగళవారం 26 నవంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## స్కిల్ వర్సిటీ విరాళం

# వందకోట్లు వెనక్కి

- ఆదానీ డబ్బులు తీసుకోరాదని నిర్ణయం
- ఢిల్లీకి ఎన్నిమార్లయినా వెళుతూనే ఉంటాం
- కెటిఆర్ జైలుకెళ్లడానికి తహతహలాడుతున్నారని ఎద్దేవా
- విమర్శల నేపథ్యంలో సిఎం రేవంత్ ప్రకటన

హైదరాబాద్, నవంబర్ 25 ప్రజావినికిడి:అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. అయితే ఆదానీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వందకోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు.. ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన.. రూ.100 కోట్లు స్వీకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని.. అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరపున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా అదానీ



అంశంపై తీవ్ర దుమారం రేగుతోందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం.. నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు.

## విపక్షాల రచ్చతో

# పార్లమెంట్ వాయిదా

- పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం..
- ప్రతిపక్ష ఎంపీల నినాదాల మధ్య ఉభయ సభలు రోజంతా వాయిదా
- బుధవారం తిరిగి ప్రారంభమవనున్న సమావేశాలు
- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం విరామం



న్యూఢిల్లీ,నవంబర్ 25 ప్రజావినికిడి: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. విపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రొసీడింగ్స్ మొదలయ్యాయి. అయితే అదానీ లంచం వ్యవహారంపై చర్చ చేపట్టాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేయడంతో ఉభయ సభలు ఒక రోజంతా వాయిదా పడ్డాయి. దీంతో ఉభయ సభలు తిరిగి బుధవారం ప్రారంభమవనున్నాయి. సమావేశాలు ప్రారంభమవగానే ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు మొదలుపెట్టారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే మధ్యాహ్నం 12 గంటలకు సభలు వాయిదాపడ్డాయి. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా నినాదాలు కొనసాగడంతో ఒక రోజంతా వాయిపడ్డాయి. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలను నిర్వహించడం లేదని ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ హౌస్‌లో సభలో విపక్షాల వ్యూహాన్ని నిర్ణయించేందుకు ఇండియా కూటమికి చెందిన పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశమయ్యారు. 'మణిపూర్ అంశాన్ని ఉభయ సభల్లో లేవనెత్తాలని కోరామని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ తెలిపారు. మణిపూర్‌లో శాంతిభద్రతలతో పాటు దేశంలో నిరుద్యోగ సమస్య, ఉత్తర భారతంలో కాలుష్య పరిస్థితితో పాటు పలు అంశాలపై మాట్లాడతామన్నారు. మరోవైపు జాయింట్ పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను అభ్యర్థించాయి. కమిటీ తన పరిధిలోని కీలకమైన విషయాలను క్షుణ్ణంగా పరిశోధించి, చర్చించడానికి మరింత సమయాన్ని ఇవ్వాలని కోరాయి.

కాగా ఈ పార్లమెంట్ సమావేశాలు డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. వక్ఫ్ చట్టం (సవరణ) బిల్లుతో సహా పలు కీలక బిల్లులపై చర్చించనున్నారు. పార్లమెంట్ పరిశీలన కోసం ప్రభుత్వం మొత్తం 16 బిల్లులను లిస్టింగ్ చేసింది.

## ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలింపు పిటిషన్ కొట్టివేత

### రాజ్యాంగ ప్రవేశికపై సుప్రీం కీలక తీర్పు




న్యూఢిల్లీ,నవంబర్ 25 ప్రజావినికిడి:

రాజ్యాంగ ప్రవేశిక అంశంపై సోమవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలగించాలని దాఖలైన పిటిషన్లను తాజాగా కొట్టివేసింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకిక అనే పదాలను జోడిస్తూ 1976లో చేసిన 42వ సవరణను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పదాలను తొలగించాలని కోరుతూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు ఈ పిటిషన్లు వేశారు. ఆ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదని వారు వాదించారు. ఎమ్జర్గ÷న్సీ (1975-77) సమయంలో చేసిన ఈ సవరణల చట్టబద్ధతను వారు ప్రశ్నించారు. ఈ పిటిషన్లపై పలు వాదనలు విన్న సుప్రీంకోర్టు నవంబర్ 22న తీర్పు రిజర్వ్ చేసి, తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేసింది. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని గత విచారణల్లో సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. 'సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే' అని పేర్కొంది.

# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

- మహారాష్ట్రలో తగిన బుద్ధి చెప్పారు
- రాళ్లలో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారు
- బీఆర్ఎస్ మీదే కేసులా...
- కాంగ్రెస్ మీద కేసులుండవా.?
- మహబూబాబాద్ మహాధర్నాలో
- మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్, ,నవంబర్ 25 ప్రజావినికిడి: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. మిగతాది 2లో...

## లగచర్ల ఘటనలో అమాయకులను జైల్లో పెట్టారు

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య



2లో.

## హౌసింగ్ సొసైటీలకు

# భూ కేటాయింపులు రద్దు

- ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టు సొసైటీలకు జిహెచ్ఎంసి పరిధిలో
- భూ కేటాయింపులపై సుప్రీం కోర్టు కీలక తీర్పు
- లబ్ధిదారులకు ఆయా స్థలాలపై యాజమాన్య హక్కు,చట్టపరమైన హెూదా విషయంలో అనిశ్చితి
- ఈ ఏడాది సెప్టెంబర్ 8న పాత్రికేయులకుఇళ్ల స్థలాలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ,నవంబర్ 25 ప్రజావినికిడి:

జీహెచ్ఎంసీ పరిధిలో హౌసింగ్ సొసైటీలకు భూ కేటాయింపులను సుప్రీం కోర్టు రద్దు చేసింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులకు సొసైటీలకు గతంలో ప్రభుత్వాలు భూ కేటాయింపులు చేశాయి. వీటిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో రావు బి. చెలికాని పిటిషన్ దాఖలు చేయగా, దీనిపై విచారించిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వం లోని ధర్మాసనం సోమవారం తుది తీర్పు వెలువరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు నివాస స్థలాలను కేటాయించింది. మిగతాది 2లో...





2లో.

## అడిగిందానికే జవాబివ్వండి

### కాళేశ్వరం ఇంజినీర్లపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఆగ్రహం

# కేసీఆర్ పాలనలోనే బీసీలకు న్యాయం

## కులగణనకు చట్టబద్ధత ఉందా..? : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, నవంబర్ 25 ప్రజావినికిడి: కులగణనకు చట్టబద్ధత ఉందోలేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, యునైటెడ్ పులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి డెడికేటెడ్ కులగణన కమిషన్‌కు 35 పేజీలతో తెలంగాణ జాగృతి ఆధ్యర్యంలో చేపట్టిన సమగ్ర నివేదికను కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం బీసీలకు ఎంతో న్యాయం చేసిందన్నారు. కులగణకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. కులగణన చేపట్టబోమని బీజేపీ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ ద్వంద వైఖరిని బీసీలు ఖండించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# హౌసింగ్ సొసైటీలకు భూ కేటాయింపులు రద్దు

(మొదటి పేజి తరువాయి)

ఈ ఏడాది సెప్టెంబర్ 8న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లబ్ధిదారులకు డాక్యుమెంట్లు అప్పగించారు. ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పుతో లబ్ధిదారులకు ఆయా స్థలాలపై యాజమాన్య హక్కు, చట్టపరమైన హోదా విషయంలో అనిశ్చితి ఏర్పడింది. ఈ పరిణామం రాష్ట్ర ప్రభుత్వాల స్థలాల పంపిణీ ప్రక్రియపై అనేక ప్రశ్నలను లేవదీస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ స్థలాల పంపిణీ ప్రకియలో చట్టపరమైన లోపాలను ఈ తీర్పు ఎత్తి చూపింది. ఈ విషయంలో పారదర్శకతతోపాటు చట్ట పరమైన మద్దతు అవసరమని సూచించింది. దేశంలో ఇలాంటి కేటాయింపులకు సవాలుగా ఈ తీర్పు ఉదాహరణగా నిలిచింది. ఈమేరకు సంబంధిత లబ్ధిదారుల స్పందన బట్టి తదుపరి పరిణామాలు ఉంటాయి

# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

(మొదటి పేజి తరువాయి)

నేను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ



మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

**తెలంగాణ ఉద్యమంలో మానుకోట కీలకం**

ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబితే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని.. అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని మండిపడ్డారు.

**ఫార్మా విలేజ్ ఎవరి కోసం.....**

ఫార్మా విలేజ్ ఎవరి కోసమని కేటీఆర్ ప్రశ్నించారు. తన అల్లుడి కోసం రేవంత్ రెడ్డి పేదవాళ్ల భూములను గుంజుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నగాడు, తమ్ముని కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం లేదని విమర్శించారు. మరో 10 రోజులైతే రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది అవుతుందని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 420 హామీలు ఇచ్చారా? ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. ఇక్కడున్న డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# రూ.2,750కోట్లతో అటల్ ఇన్నోవేషన్

## మిషన్ రూ.2,481కోట్లతో ప్రకృతి - వ్యవసాయంపై జాతీయ మిషన్

## విశ్వవిద్యాలయాల్లో అందుబాటులోకి - జర్నల్స్, పరిశోధన పత్రాలు

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు




న్యూఢిల్లీ: నవంబర్ 25 ప్రజావినికిడి:కేంద్ర కేబినెట్ పాన్‌కార్డులకు సం బంధించి సంచలన నిర్ణయం తీసుకుంది. పా న్‌కార్డుల ఆధునీకరణకు కేంద్ర కేబినెట్ ఆ మోదం తెలిపింది. కేంద్ర మంత్రివర్గం సోమవారం ఈమేరకు ఆమోదం తెలిపింది. పాన్ 2.0 కి కేంద్ర కేబినెట్ ఆమోదించిన కోడ్‌తో పాన్‌కార్డుకు ఉచితంగా అప్‌గ్రేడ్ చేయబడుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మం త్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాన మం త్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆదాయ పు పన్ను శాఖ యొక్క పాన్ 2.0 ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. రూ. 1435 కోట్ల వ్య యంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ ప్రాజెక్టును రూ పొందిస్తున్నారు. పిఎఎన్ 2.0 ప్రాజెక్టు అనేది పన్ను చెల్లింపుదారులకు మరింత మెరుగైన డి జిటల్ అనుభవ సాంకేంతిక పరివర్తన ద్వా రా పన్ను చెల్లింపు దారుల రిజిస్ట్రేషన్ సేవల వ్యాపార ప్రక్రియలు చేయడానికి ఇగవర్నెన్ ప్రాజెక్టుగా పేర్కొంటున్నారు.పాన్ కార్డు ఉన్నవారికి ప్యాన్ కార్డును ఉచితంగా క్యూఆర్ కోడ్‌తో అప్‌గ్రేడ్ చేసే ప్యాన్ (పిఎఎన్)2.0 ప్రాజెకు వల్ల టాక్స్‌పేయర్ రిజిస్ట్రేషన్ సర్వీస్ సాంకేతిక ప్రక్రియతో వేగంగా నాణ్యంగా వినియోగదారులకు అందుతుంది. ఈ ప్రాజెక్టు వల్ల వాస్తవమైన, డేటాతో కూడిన , పర్యావరణ హితమైన విధానాలతో , తక్కువ ఖర్చుతో , భద్రతతో , తగిన సౌకర్యాలతో సేవలు లభిస్తాయని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తిగా డిజిటల్ సౌకర్యంతో డిజిటల్ ఇండియా విజన్‌తో ప్రభుత్వ సంస్థల ద్వారా ప్యాన్ వినియోగదారులకు అందుబాటు లోకి వస్తుందని అధికారిక ప్రకటన వెలువడింది. సాంకేతికంగా డిజిటల్ ద్వారా టాక్స్‌పేయర్ రిజిస్ట్రేషన్ సమకూరడమే కాక, వాణిజ్యానికి ఇతోధికంగా ఉపయోగపడుతుందని ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పాన్/టిఎఎన్ 1.0 ఎకోసిస్టమ్ ను ఒక విధంగా ఇది అప్‌గ్రేడ్ చేయడమే. ప్రస్తుతం దాదాపు 78 కోట్ల ప్యాన్స్ జారీ కాగా, వీటిలో 98 శాతం వ్యక్తిగతమైనవి.

# అడిగిందానికే జవాబివ్వండి

## కాళేశ్వరం ఇంజినీర్లపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఆగ్రహం

### పొంతనలేని సమాధానాలు ఇవ్వొద్దని వార్నింగ్ ఆనకట్టలకు సంబంధించిన రికార్డులు స్వాధీనం ఇంజినీర్ల చేత సంతకాలు క్వాలిటీ కంట్రోల్ రిజిస్టర్లు గల్లంతైనట్లు గుర్తింపు

హైదరాబాద్, ,నవంబర్ 25 ప్రజావినికిడి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగుబాటు పై సమగ్ర విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ చంద్ర ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కాళేశ్వ ర కమిషన్ విచారణ కొనసాగుతోంది. అయితే ఈ క్రమంలోనే సోమవారం మేడిగడ్డ, అన్నారం, సుం దిళ్ల బ్యారేజీల వద్ద పనిచేసిన డిఇఇ, ఎఇఇలను క మిషన్ చీఫ్ జస్టిస్ చంద్ర ఘోష్



విచారించారు. వి చారణలో ఎఇఇ, డిఇఇ ఇంజనీర్లపై కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్రఘోష్ అసహనం వ్యక్తం చేశారు. అ డిగిన ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు చెప్పాలి ముందుగా అనుకొని వచ్చి పొంతన లేని సమాధానాలు చెప్పొద్దు అని కమిషన్ చీఫ్ వ్యాఖ్యానించా రు. ఫీల్డ్‌లో జరిగిన పనులకు సంబంధించిన రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. సంతకాలు చేసుకున్న కమిషన్ రిజిస్టర్లలో ఇంజనీర్ల చేత సంతకాలు తీసుకున్నారు. మేడిగడ్డ బ్లాక్ 7కు సంబంధించిన ఫీల్డ్ వర్క్ ప్లేస్మెంట్ రిజిస్టర్‌లను సంతకా లు చేయించుకున్నారు.కాళేశ్వరంలో జరిగిన ప నులపై ప్లేస్మెంట్ రికార్డులు రో జువారీగా చేశారా లేదా? ఒకరోజు పనినిమరొక రోజు నమోదు చేశారని కమిషన్ ప్రశ్నించింది. కుంగిన పిల్లర్లకు సంబంధించిన బ్లాక్ 7 రిజిస్టర్‌లపై ఇంజనీర్ల సంతకాలు కమిషన్ తీసుకుంది. 2020లోని కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ వద్ద డ్యామేజీని గుర్తించి ఉన్నతాధికారులకు నిర్మాణ సంస్థలకు లేఖలు రాసినట్లు ఇంజనీర్లు వెల్లడించారు. మొదటి డ్యామేజీ 2020లోనే జరిగినట్లు గుర్తించి లేఖలు రాసినట్లు కమిషన్ ముందు ఇంజనీర్లు చెప్పినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో క్వాలిటీ కంట్రోల్ రిజిస్టర్లు మిస్ అయినట్లు కమిషన్ గుర్తించింది. మేడిగడ్డ బ్లాక్ 7తో పాటు మూడు బ్యారేజీలకు సంబంధించిన వర్క్ ప్లేస్మెంట్ రిజిస్టర్‌లను కాళేశ్వరం కమిషన్ స్వాధీనం చేసుకుంది. ఇంజినీర్లపై కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రఘోష్ అసహనం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ దాదాపు 18 మంది ఇంజినీర్లను ప్రశ్నించారు.

## ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు

# ముమ్మర ఏర్పాట్లు

### కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి..

### తొలుత అందుబాటులోకి రానున్న మామునూరు ఎయిర్‌పోర్టు

హైదరాబాద్, నవంబర్ 25 ప్రజావినికిడి: తెలంగాణలో కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. వరంగల్‌లోని మామునూరు, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సీఎం రేవంత్ సర్కారు రెడీ అయ్యింది. ఇక కేంద్రంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా తెలుగు వ్యక్తి రామ్మోహన్‌నాయుడు ఉండడంతో అనుమతుల విషయంలోనూ సానుకూల స్పందన వచ్చే ఛాన్స్ ఉంది. అయితే హైదరాబాద్ తర్వాత తెలంగాణలోనే అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఉన్న మామునూరులో తొలుత ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. తొలి విడతలో మామునూరు ఎయిర్‌పోర్టును చిన్న విమానాల రాకపోకలకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. వరంగల్ మహానగరం మాస్టర్ ప్లాన్ తయారీకి ఇప్పటికే ఆమోదం లభించింది. మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి ప్రక్రియను 2025 డిసెంబరుకల్లా పూర్తి చేయాలని తెలంగాణ సర్కారు టార్గెట్‌గా పెట్టుకుంది. ఆ తర్వాత 2027 సంవత్సరం నాటికి రెండో దశలో పెద్ద విమానాలు, కార్గో విమానాల ఆపరేషన్‌కు వీలుగా మామునూరు ఎయిర్ పోర్టును డెవలప్ చేస్తారు. వాస్తవానికి నిజాం నవాబు పాలనా కాలంలో మామునూరులో ఎయిర్ పోర్టు ఉండేది. దీనికి ఇప్పటికే 696.14 ఎకరాల భూమి ఉంది. ఎయిర్ పోర్టు కోసం అదనంగా మరో 253 ఎకరాలను సేకరించేందుకు తెలంగాణ సర్కారు రూ.205 కోట్లను ఇటీవలే విడుదల చేసింది. రాబోయే నాలుగేళ్లలో భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు కూడా అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్ పోర్టు ఏర్పాటు కోసం మూడు మండలాల పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల్లో భూసేకరణపై ఓ అంచనాకు వచ్చారు. రామగుండం పట్టణం సమీపంలో ఉన్న బసంత్‌నగర్‌లో గతంలోనే ఎయిర్‌పోర్టు ఉండేది. బీకే బిర్లా తమ సిమెంట్ పరిశ్రమ సమావేశాలకు రావడానికి దీన్ని అప్పట్లో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో కొత్తది ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కారు యోచిస్తోంది. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు దాదాపు 1,592 ఎకరాల్లో భూమి రెడీగా ఉందని తెలుస్తోంది. అయితే ఈ మూడు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నుంచి అనుమతులను పొందాల్సి ఉంది.

# లగచర్ల ఘటనలో అమాయకులను జైల్లో పెట్టారు

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



హైదరాబాద్, నవంబర్ 25 ప్రజావినికిడి: లగచర్ల ఘటనలో అమాయకులను జైలులో పెట్టారని, కేసులు ఎత్తివేసి బాధితులను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన సంగారెడ్డి జిల్లా కంది జైలులో లగచర్ల బాధితులను పరామర్శించారు. ఘటనకు సంబంధించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బక్కి వెంకటయ్య మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి గ్రౌండ్ లెవల్ రిపోర్టు ఇస్తామని చెప్పారు. లగచర్ల, రొటిబండ తండాలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందం పర్యటించిందని, ఇప్పటికీ గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారన్నారు. కలెక్టర్‌పై దాడి ఘటన దురదృష్టకరమని, కానీ అమాయకులను జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు కర్కశంగా వ్యవహరించారని, అర్ధరాత్రి ఇండ్లల్లోకి చొరబడి దాడులు చేసి అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరికాదని, ఇది ఎస్సీ, ఎస్సీ యాక్టుకు విరుద్ధమన్నారు. అట్రాసిటీ కేసులపై స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ అధికారులను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమమంలో దళిత సంఘాల నాయకులు జగన్, దుర్గాప్రసాద్, ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# అంబర్ రెసోజెట్ రూ.250కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, ,నవంబర్ 25 ప్రజావినికిడి:

పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినిమయ వస్తువులు, విడి భాగాలు అందించే 'అంబర్ – రెసోజెట్ భాగస్వామ్య సంస్థ రా ష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పా టు చేసేందుకు ముందుకొచ్చింది. సోమవారం ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సంస్థ ప్రతినిధులు తమ పెట్టుబడుల ప్రణాళికను వెల్లడించారు. అంబర్‌రెసోజెట్ సంస్థకు ప్రభుత్వ పరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సంస్థ దేశం లోని పలు కంపెనీల కోసం రూమ్ ఏసీలు, అత్యాధునిక వాషిం గ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండిషనర్ల లాం టి పలు పరికరాలకు ఉత్పత్తి చేసి అందిస్తోందని ఆయన తెలిపా రు. వచ్చే మూడేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పుతుందని శ్రీధర్ బాబు చెప్పారు.దీని వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే అత్యాధునిక ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పిసిబి)ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. వందే భారత్ రైళ్లు, మెట్రో రైళ్ల ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలతో పా టు, బస్సులు, డిఫెన్స్ వాహనాలు, పారిశ్రామిక అవసరాలకు ఎయిర్ కండిషనర్ల తయారీలో అంబర్ ఎంటర్ ప్రైజెస్‌కు మంచి పేరుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ తాజాగా హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీఐఐసీ ఎండీ డా.ఇ.విష్ణువర్ధన్ రెడ్డి, సిఇఓ మధుసూదన్, డైరెక్టర్ ఎలక్ట్రానిక్స్ డా.ఎస్ కె శర్మ, అంబర్, రెసోజెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 26 నవంబర్ 2024

## బండారి నరసింహారెడ్డి కి నివాళులర్పించిన

### :టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి..



ప్రజావినికిడి, (ఎల్బీనగర్):
బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కర్మాన్ఘాట్ జానాంజనేయ స్వామి ఆలయ మాజీ ధర్మకర్త బండారు శ్రీనివాస్ రెడ్డి తండ్రి గారైన కీర్తిశేషులైన బండారి నరసింహారెడ్డి దశదినకర్మ సోమవారం నాడు హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఈదుల కంటి రామిరెడ్డి గార్డెన్స్ లో జరిగిన కార్యక్రమానికి మీర్పేట్ కార్పొరేషన్ టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి,రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు నెల్లోజు సాల్వా చారి పాల్గొని బండారి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి బండారి నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బండారి శ్రీనివాస్ రెడ్డి రజిత, బండారి వెంకటరెడ్డి మమత,బడారి శ్రీకాంత్ రెడ్డి సంధ్య, భీమిడి శ్రీలత ప్రశాంత్ రెడ్డి,మనుమండ్లు భరత సింహారెడ్డి, రిత్విక్ రెడ్డి,తనీష్క రెడ్డి శ్రేయాన్ రెడ్డి,సుప్రతిక్ రెడ్డి, రుద్రాన్ష్ రెడ్డి,శ్రీత రెడ్డి, ప్రచోదయా రెడ్డి, సునీత రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు నిర్మాణానికి అడ్డు పడుతున్న దుండిగల్ బిఆర్ఎస్ కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్ పై

## రెవిన్యూ అధికారులకు పిర్యాదు..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
రోడ్డు నిర్మాణానికి అడ్డు పడుతున్న దుండిగల్ బిఆర్ఎస్ కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్ పై వీరహనుమాన్ కాలనీ సభ్యులు రెవిన్యూ అధికారులకు పిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దుందిగల్ గ్రామం సర్వే నెంబర్లు 24 26 94 లో 60 గజాల ప్లాట్లను సుమారు మూడు వందల మందిమి 2008.2009లో కొనుగోలు చేసాం అని . పాట్లను పూనాదులు వేసుకుని అప్పుడు అప్పుడు చూస్తూ పాట్లను కాపాడు కొన్నాం. అన్నారు. ఈ మద్య టిఆర్ఎస్ కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్ దారి ప్రక్కన ఉన్న పెంటా కుప్పలని చదును చేసి ప్లాట్లు చేసాడు. ఆ ప్లాట్ల దారి నుండి మా ప్లాట్లలోకి దారిలో పోనివ్వ కుండ అడ్డుపడుతున్నాడని వారు ఆరోపించారు. ఈ దారిలో రైతులే పోవాలి తప్ప ప్లాట్లదారులు పొవద్దు అని భయపెట్టుతున్నాడని ఆరోపించారు. ప్లాటుకు కొంత డబ్బులు ఇస్తేనే దారి నుండి వేల్లాలని ఇబ్బంది పడుతున్నారని,గ్రామ ప్రజలు ఆ పెంటల భుమి ప్రభుత్వ భూమి అంటున్నారు. గత యభై సంవత్సరాలుగా ఈ దారి వెంటనే నడచి వెల్లేవారమని గ్రామస్తులు చెబుతున్నారు. 2008నుండి ఇన్ని సంవత్సరాలుగా మిమ్మల్ని ఎవరు ఇబ్బంది పెట్టలేదన్నారు. ఇప్పుడు టిఆర్ఎస్ కౌన్సిలర్ దౌర్జన్యంగా మా నుండి డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారని అన్నారు. కావున మాకు దారి సమస్య తీర్చి యదావీదిగా దారిని చూపాలని రెవిన్యూ అధికారు లకు వినతిపత్రం అందజేశామన్నారు. త్వరలో కలెక్టర్ ను కలసి ప్రజలను ఇబ్బందులకు గురించేస్తున్న శ్రీనివాస్ యాదవ్ పై పిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టి పి సి సి జాయింట్ సెక్రటరీ పోలీసు జివేందర్ రెడ్డి,కాలనీ సభ్యులు కట్టా మహాలక్ష్మి,సాయిరాం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ విశ్వాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..








ప్రజావినికిడి,(ఎల్బీనగర్): 153 వ సారి రక్తదానం చేసిన వృక్షజీవి డాక్టర్: మార్కండేయులు ఈ రోజు అనగా 24 నవంబర్ 2024, ఆదివారం రోజున,కాపు,తెలగ, ఒంటరి సంఘం వారి కార్తీక మాస వనభోజన మహోత్సవం లో "ప్రతిమ సాయి బ్లడ్ బ్యాంక్" వారి చే 'లయన్స్ క్లబ్ విశ్వాస్' వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ డాక్టర్ మార్కండేయులుతో పాటు పద్మశ్రీ డాక్టర్ చంద్రశేఖర్,శ్రీ దొర రాజు,ఛైర్మన్ ఆలివ్ మిఠాయి, శ్రీ అల్లం నాగేశ్వరరావు,డాక్టర్ బొగ్గు సురేశ్,డాక్టర్ పెండెం కృష్ణ కుమార్,డాక్టర్ రామ్మోహన్ నాయుడు,డాక్టర్ విజయరంగా డాక్టర్ నరేశ్ శ్రీసారంగ పాణి అలాగే వనస్థలిపురం యూత్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ డాక్టర్ మార్కండేయులు 153 వ సారి రక్తదానం చేయడం మాకు సంతోషంగా ఉంది, మేమందరం ఆయనకి అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో డాక్టర్ మార్కండేయులు యువతకు ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వలన ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని కూడా చెప్పడం జరిగింది.

## శివయ్య ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలి..

### కార్పొరేటర్ పవన్ కుమార్..






ప్రజావినికిడి,(కొత్తపేట):సోమవారం రోజు కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో శివ గంగా కాలనీలోని సదా శివాలయంలో ఆ మహా శివుడికి అన్న ప్రసాద అభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ అభిషేకం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొని కాలనీ వాసులతో కలిసి ఆ పరమ శివుడి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మిపతి గౌడ్,అంబాలా మల్లేష్, సుబ్బారావు, ఆంజనేయులు, నర్సింగ్,నాయకులు తోట మహేందర్ యాదవ్,వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కుల పెద్దలు,మత పెద్దలు,నాయకులు, రాజకీయ నాయకులు ఇలా ఉన్న వారందరూ

# మారాలంటున్న పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ...







ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
మనము ప్రకృతిలో భాగము,ప్రకృతి మనలో భాగము కాదు" ఈ సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని ఆలోచిస్తే,మనము ఏదైతే ఇస్తామో!అదే మనకు తిరిగి వచ్చును. మానవ ధర్మమునకు, మృగధర్మమునకు ఉన్న భేదమును అందరూ తెలుసుకోవాలి.

అప్పుడే మనమందరము,ఒక కుటుంభ సభ్యులమే అని భావించి మానవత్వం,మానవ విలువలు,మానవ సంబంధాలతో జీవించగలరు. "కూటికోసం కోటి విద్యలు"ఏ సమాజమైన అభివృద్ధి చెందాలన్నా, పతనం కావాలన్నా ఆ సమాజంలో ఉన్న కుల పెద్దలు,మత పెద్దలు, నాయకులు,రాజకీయ నాయకులు,అధికారులు, పాలకులు,మేధావులు, విమర్శకులు,విశ్లేషకులు, సంఘసంస్కర్తలు, మీడియా మిత్రులు, కాయకష్టం చేసేవారు. వ్యవసాయదారులు, వ్యాపారులు ఇలా ఉన్నవాళ్ళందరి గుణాలు,లక్షణాలు, స్వభావాల ప్రభావాలే ప్రధాన పాత్ర పోషిస్తాయి. కావున వీళ్ళందరూ తమ స్వార్ధాన్ని వదిలి, సమాజంలోని ప్రజలు మరియు ప్రజలతో పాటు నివసిస్తున్న అన్ని ప్రాణులన్నియును,ఒక కుటుంబమే అని భావించినప్పుడే, సమాజం ఆరోగ్యవంతంగానూ, దృఢంగా,స్థిరంగా, నిచ్చలంగానూ మరియు అదురు, బెదురు లేకుండా ముందుకు పోగలరని పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధినేత సదానంద రెడ్డి తన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నాడు.

పైన పేర్కొన్న వారందరూ ప్రజలను, తమ కుటుంబ సభ్యులుగాను మరియు తమ సంతానంగాను భావించి ప్రజలకు విద్యను,వైద్యాన్ని, న్యాయాన్ని, ఉపాధి అవకాశాలను.. వనరులను,ఉద్యోగ భద్రతను అందుబాటులో ఉంచినప్పుడే ప్రజలు ఉచిత పథకాల కోసం, నిరుద్యోగ భృతికోసం, రిజర్వేషన్లకోసం ఎదురు చూడకుండా, స్వశక్తితో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలనే ఉత్సాహాన్నికరపరుస్తూ,ఇతరులకు నీతివంతంగా, ఆదర్శవంతంగా, ధర్మబద్ధంగా జీవిస్తూ, కరుణవైపు సమాజాన్ని ముందుకు తీసుకుపోగలరు. కావున ప్రస్తుత ప్రభుత్వాలు స్వార్థాన్ని, మోసాన్ని, ప్రలోభాలను, మాయను,భ్రమలను త్యజించి ప్రజలకు ఆత్మీయతలను, ప్రేమను, న్యాయబద్ధతను, జ్ఞానాన్ని ఇచ్చినప్పుడే ఈ ప్రజలు ప్రభుత్వాలను విశ్వసించి, అభిమానంతో సంపదను సృష్టించగలరని, పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధినేత సదానంద రెడ్డి ప్రజల తరపున మీడియా ముఖంగా ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నాడు.

# పేదలకు చేయూతనిస్తా..

## పేద మహిళ చికిత్స కోసం రూ.20వేల చెక్కు అందజేత..

### భీష్మ రాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి సేవలను కొనియాడిన స్థానికులు..



ప్రజావినికిడి,(నారాయణపేట):
ఆపదలో ఉన్న పేదలకు చేయూతనిచ్చేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని భీష్మరాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ కే.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా నారాయణపేట బీసీ కాలనీకి చెందిన సల్ల మానిగప్ప-మాసమ్మ దంపతులు. గత కొంతకాలంగా మాసమ్మ మానసిక స్థితి బాగాలేదు. ఇటీవల మాసమ్మ ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. కాలిన గాయాలతో ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మాసమ్మకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాసమ్మది పేద కుటుంబం కావడంతో సహాయం చేయాలని కోరుతూ ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక నారాయణపేట జిల్లా అధ్యక్షులు సల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో భీష్మరాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ కే.రాజ్ కుమార్ రెడ్డిని సంప్రదించారు. మాసమ్మ ఆర్థిక పరిస్థితి,ఆరోగ్య పరిస్థితిని రాజ్ కుమార్ రెడ్డి తెలుసుకున్నారు. మాసమ్మకు మెరుగైన చికిత్స చేయించేందుకు గాను రూ.20వేల చెక్కును రాజ్ కుమార్ రెడ్డి అందజేశారు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,కటిక పేదరికంతో బాధపడుతున్న మాసమ్మ మానసిక స్థితి బాగాలేని కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలుసుకొని ఆమెకు మెరుగైన చికిత్స కోసం రూ.20 వేలను అందజేయడం జరిగిందని తెలిపారు.

### రాజ్ కుమార్ రెడ్డి సేవలు అభినందనలు :సల్ల వెంకటేష్

పేదలను ఆదుకునేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ రాజకుమార్ రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక నారాయణపేట జిల్లా అధ్యక్షులు సల్ల వెంకటేష్ కొనియాడారు. తమ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేదలకు చేయూతనిచ్చి ఆర్థికంగా ఆదుకున్నారని అన్నారు. మాసమ్మ మానసిక స్థితి, అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విషయాన్ని తెలియజేసిన వెంటనే మానవతా దృక్పథంతో మాసమ్మకు మెరుగైన వైద్యం కోసం రూ.20వేలను అందజేయడం సంతోషకరమని అన్నారు. రాజ్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని సేవలు చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానిగప్ప,తిప్పన్న, బాలాజీ,సుదర్శన్ రెడ్డి,హన్మంతు, సంతోష్,శివరాజ్, రాజు,ముగ్గు గోవింద్, రవి,సిరిగిరి వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

## రెండు రోజులలో సమగ్ర కుటుంబ సర్వే ముగియనుంది..

### ఇప్పటివరకు సర్వేలో నమోదు చేసుకొని వారు, నమోదు చేయించుకోగలరు..


### షాద్ నగర్ పట్టణ మున్సిపల్ కమిషనర్ వెంకన్న..



ప్రజావినికిడి,(షాద్ నగర్):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక,ఆర్థిక, విద్య రాజకీయ కుల గణన సర్వే షాద్ నగర్ పురపాలక సంఘ పరిధిలో 28 వార్డులలో రెండు రోజుల్లో ముగియనుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని షాద్ నగర్ పుర కమీషనర్ వెంకన్న తెల్పినారు. అలాగే ఇట్టి సర్వే చేసే సమయంలో అందుబాటులో లేని వారు అలాగే తమ వివరాలు నమోదు చేసుకోవాలనుకొనేవారు రాంచందర్ రావు, సి.ఆసిస్టెంట్, ఫోన్ నెం. 9959909909తో గాని లేదా పురపాలక సంఘ కార్యాలయములో సంప్రదించి మీ ఏరియా కు సంబందించిన ఎన్యూమరేటర్ వద్ద తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

## రావి నారాయణరెడ్డి నగర్‌కు మంచినీటి ఇక్కట్లు ....

### రావి నారాయణరెడ్డి నగర్ లో పది రోజులకు ఒకసారి మంచినీటి సరఫరా చేయడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని అధికారాలకు వినతి..



ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):
రావి నారాయణరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సాతాల గోపాల్ ఆధ్వర్యంలో ఐడిపిఎల్ వాటర్ వర్క్స్ ప్రజావాణి కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కు రావి నారాయణరెడ్డి నగర్ లో ఉన్న మంచినీటి సమస్యను వివరించి మాకు గత నాలుగు నెలల నుండి 10 రోజులకు ఒకసారి మంచినీటి సరఫరా చేస్తున్నారని దానితో కాలనీవాసులు తీవ్రంగా మంచినీటి సమస్య ఎదురుకోవడంపై వినతిపత్రం ఇవ్వడం జరిగిందిస్పందించినా జనరల్ మేనేజర్ ప్రతి నాలుగు రోజులకు ఒకసారి మంచినీళ్లు సరఫరా చేయమని అధికారులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఉపాధ్యక్షులు బి శ్రీనివాస్,కే.పరమేష్, ఆర్గనైజర్ కే. హనుమన్న,ఎస్ ప్రసాద్,బిక్షం,కే. అనంతమ్మ, లక్ష్మి,నిర్మల,చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





## కీ.శే బండారి నరసింహారెడ్డి కి నివాళులర్పించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..

ప్రజావినికిడి, (ఎల్బీనగర్): బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు.కర్మాన్ఘాట్ జానాంజనేయ స్వామి ఆలయ మాజీ ధర్మకర్త బండారు శ్రీనివాస్ రెడ్డి తండ్రి గారైన కీర్తిశేషులైన బండారి నరసింహారెడ్డి దశదినకర్మ సోమవారం నాడు హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఈదుల కంటి రామిరెడ్డి గార్డెన్స్ లో జరిగిన కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,మీర్పేట్ కార్పొరేషన్ టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు నెల్లోజు సాల్వా చారి పాల్గొని బండారి శ్రీనివాస్ రెడ్డి తో కలిసిబండారి నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



గరిడేపల్లి నవంబర్ 25 ప్రజావినికిడి:మిర్యాలగూడ-హుజూర్నగర్ ప్రధాన హైవేపై డివైడర్ ను ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు మండలం జర్రిపోతుల గూడెం గ్రామానికి చెందిన షేక్ బాబా (36) అనునతను తన గ్రామంలోని షేక్ పాషా యొక్క ట్రాక్టర్ లో వరి ధాన్యం పోసుకొని మిర్యాలగూడ వెళ్ళి రైస్ మిల్ లో వరి ధాన్యం దిగుమతి చేసి తిరిగి వస్తుండగా రాత్రి 09.30 గంటల సమయంలో గరిడేపల్లి మండలం ఎల్ బి నగర్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు తన ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్ కు ఎడమవైపు ఉన్న డివైడర్ కు ఢీ కొట్టింది. డ్రైవర్ ఛాతికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతనిని 108 అంబులెన్స్ ద్వారా హుజూర్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్ తరలించగా డాక్టర్ పరిశీలించి అప్పటికే మరణించినాడు అని తెలిపాడు. మృతుని భార్య షేక్ రేశ్మా ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏ ఎస్ ఐ రాములు నాయక్ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలి

### - తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు




ఖమ్మం, నవంబర్ 25 ప్రజావినికిడి: ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం మంత్రి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ప్రజా ప్రతినిధులతో కలిసి ఖానాపురం హవేలీ 4వ, డివిజన్లో 15వ, ఆర్థిక సంఘం నిధులు కోటి 43 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జి ప్లస్ 1 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన ప్రతిసారి అన్ని ప్రాంతాల ప్రజల అవసరాల మేరకు పనులు చేస్తున్నామని, ఎటువంటి రాజకీయ వివక్ష లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఖమ్మం నగరంలో మనమంతా అనుకున్న అభివృద్ధి పనులు మొత్తం ఒకే రోజు చేయలేమని, ఒక పని తర్వాత మరొకటి అభివృద్ధి నిధులు సర్దుబాటు చేసుకుంటూ, అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఖమ్మం నగర ప్రధాన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నుంచి నిధులు తీసుకుని వచ్చి పరిష్కరిస్తానని అన్నారు. మొక్కల పెంపకం వాటి సంరక్షణ, కలెక్టరేట్ వరకు మొక్కలు పెంచి గ్రీనరీగా ఉంచాలని మంత్రి స్పష్టం చేశారు.

**మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ**

4వ డివిజన్లో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెట్టడం చాలా ఉపయోగకరంగా ఉంటుందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. చాలా మంది గ్రానైట్ ఫ్యాక్టరీలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నారని, వారికి ఈ హెల్త్ సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. రాబోయే 4 సంవత్సరాల సమయంలో మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో ఖమ్మం నగరం అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ**

అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ పనులను సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతతో సకాలంలో చేపట్టేలా నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 4వ, డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి అలియాస్ అయ్యప్ప రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళీ, ప్రజా ప్రతినిధులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. బి. కళావతి బాయి, మునిసిపల్ ఇఇ లు కృష్ణాలాల్, రంజిత్, డిఇ ధరణి కుమార్, ఏఇ యాకూబ్ వలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభను విజయవంతం చేయండి..

**నూతన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ పిలుపు..**

**ఈనెల 27న ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం..**

**స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం..**

**హాజరుకానున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు జూపల్లి కృష్ణారావు తదితరులు..**



ప్రజావినికిడి,(షాద్ నగర్):
షాద్ నగర్ ప్రభుత్వ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఈనెల 27న బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేస్తున్నట్లు నూతన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తెలిపారు. స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర ప్రముఖులు, అధికారులు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయా విభాగాల వారు పెద్ద ఎత్తున హాజరుకావాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఇదే ఆహ్వానంగా భావించి, కార్యకర్తలు నాయకులు పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాలతో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

## బౌరంపేట్ గ్రామ ప్రధాన రహదారి నీ గ్రామస్థులతో కలిసి రోడ్డు పనులు పరిశీలించిన బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి..





ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):
దుండిగల్ మున్సిపాలిటీ పరిధి లోని బోరంపేట గ్రామ ప్రధాన రహదారి నీ గ్రామస్తులతో కలిసి పరిశీలించిన బిజెపి నాయకులు పీసరి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత కొన్ని సంవత్సరాల నుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న బౌరంపేట్ మరియు గ్రామం మీదుగా వెళ్లిన ఇతర గ్రామాల ప్రజలు నేటితో ప్రధాన రహదారి సమస్య ఇబ్బందులకు స్వస్తి పలికి రోడ్డు పనులు పూర్తి చేసుకోవడం జరిగింది.గత కొన్ని సంవత్సరాల నుడి హెచ్ఎండబ్ల్యూఎస్ (మిషన్ భగీరథ) మంచి నీటి పైప్ లైన్లు త్రోవ్వడం వలన రోడ్లు అస్తవ్యస్తం అయ్యాయని ఈయొక్క రోడ్డు నిర్మాణం హెచ్ఎండబ్ల్యూఎస్ వాళ్లు కానీ ఆర్అండ్ బి వాళ్ళు కానీ వేయాలి కానీ వాళ్ళు పట్టించుకోకపోవడం వలన గ్రామస్థుల అభ్యర్థన మేరకు మన మున్సిపాలిటీ 17 వార్డు జనరల్ ఫండ్ నుండి కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి ముందస్తు ఆలోచన చేసి ఈ యొక్క బిల్లు పెట్టుకోవడం రోడ్డు నిర్మాణం పనులు తాత్సారం వలన ప్రజల ఇబ్బందులు చూడలేక బౌరంపేట్ బీజేపీ నాయకులతో కలిసి రోడ్డు మీద వరి నాటు వేసి నిరసన తెలియజేయడం జరిగింది.దీనితో వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులు పనులు ప్రారంభించడం జరిగింది. కమిషనర్ ఏఈ సహకారంతో రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసుకోవడం వలన గ్రామస్తులు చాలా సంతోషం వ్యక్తం చేయడం జరిగింది.ఈ ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ సమయంలో సహకరించిన బౌరంపేట్ గ్రామ ప్రజలు అందరికి ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో గ్రామస్తులు దుగురు సత్యనారాయణ, గడీల సత్యనారాయణ,చింత మల్లేష్,పీసరి శేఖర్ రెడ్డి,శ్రీకాంత్, సంజీవరెడ్డి, నరేష్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్‌కి గురైన విద్యార్థిని శైలజ మృతి

**గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి**

**మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ..**

**విద్యార్థికి కన్నీటి నివాళి**



హైదరాబాద్నవంబర్ 25 ప్రజావినికిడి: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కి గురై గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ సోమవారం మృతి ) చెందింది. అక్టోబర్ 30న వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగగా 64 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. రిలో ఇద్దరు కోలుగా శైలజ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పై ఉంచి చికిత్స అందించారు. దాదాపు 20 రోజులుగా చికిత్స పొందిన ఆమె చివరకు మృత్యువాత పడ్డారు. శైలజ మృతితో తల్లిదండ్రులు, బంధువు ల రోదనలు మిన్నంటాయి. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గురుకుల పాఠశాలలు అధ్వాన్నంగా మారి విద్యార్థులు చనిపోతున్నారని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యానికి బలైపోయిన వాంకిడి గిరిజన గురుకుల విద్యార్థిని శైలజకు కన్నీటి నివాళి అర్పిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. మీ ప్రాణాలు బలి తీసుకున్న పాపం.. ఈ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతదన్నారు. 25 రోజులుగా నువ్వు వెంటిలేటర్ మీద అనుభవించిన నరకానికి ప్రభుత్వమే జవాబుదారీ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.శైలజ తల్లిదండ్రులకు గుండె కోతను మిగిల్చిందు సీఎం రేవంత్ రెడ్డి. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. విషాహారం వల్ల కన్నుమూయటం కలిచి వేస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకులంలో నాణ్యత లేని భోజనం పెట్టడం పాపం కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించకపోవడం మరొక పాపం. అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం విద్యార్థిని ప్రాణాల మీదకు తెచ్చింది. నిమ్స్ ఆసుపత్రిలో బిడ్డను పట్టుకొని అక్కడే ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంలోనూ కాంగ్రెస్ సర్కార్ పూర్తి వైఫల్యం చెందింది. చివరకు ఆ అమ్మాయి చావును కూడా దాచి పెట్టాలనే ఉద్దేశంతో, దొంగ చాటున మృతదేహాన్ని తరలిస్తుండడం సిగ్గుచేటు.కుటుంబానికి బాధ్యత వహించి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## చపాతీ రోల్ గొంతులో ఇరుక్కుని విద్యార్థి మృతి



హైదరాబాద్నవంబర్ 25 ప్రజావినికిడి:
బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం విషాదం చోటుచేసుకుంది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విరాన్ జైన్ అనే ఆరవ తరగతి విద్యార్థి చపాతీ రోల్ చేసుకొని తింటుండగా గొంతులో ఇరుక్కుపోయింది. దీంతో శ్వాస ఆడక అపస్మార స్థితిలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా, ఆకస్మికంగా తమ కుమారుడు మృత్యువాతపడటంతో మృతుడి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# రాజాసాబ్ లైన్‌లో.. మంచు విష్ణు కన్నప్ప రిలీజయ్యేది అప్పుడే

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం కన్నప్ప బాలీవుడ్ డైరెక్టర్ ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఆయా పాత్రలకు సంబంధించిన లుక్స్ విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయం సాక్షిగా కన్నప్ప విడుదల తేదీని ప్రకటించారు. లార్డ్ శివ అపర భక్తుడు కన్నప్ప చిత్రాన్ని 2025 ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభాస్-మారుతి కాంబినేషన్‌లో వస్తోన్న రాజాసాబ్ ఏప్రిల్ 10న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ లెక్కన ఏప్రిల్‌లో రెండు సినిమాల మధ్య పోరు ఎలా ఉంటుందనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే కన్నప్ప నుంచి లాంచ్ చేసిన టీజర్, పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. కన్నప్ప నుంచి షేర్ చేసిన తిన్నడు, ముండడు, చండుడు, మారెమ్మ, పిలక-గిలక పాత్ర సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి. కన్నప్పలో బాలీవుడ్ యాక్టర్ అక్షయ్‌కుమార్ శివుడిగా నటిస్తున్నాడు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. మంచు విష్ణు తొలి పాన్ ఇండియా సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.






# అతడెవరో అందరికీ తెలుసు

## రిలేషన్‌షిప్‌పై ఓపెన్ అయిపోయిన రష్మిక మందన్నా


టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీయెస్ట్ కాంబోలో టాప్‌లో ఉంటుంది విజయ్ దేవరకొండ -రష్మిక మందన్నా గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాలతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ ఇద్దరు ఆఫ్ స్క్రీన్‌లో కూడా సూపర్ బాండింగ్ మెయింటైన్ చేస్తుంటారని తెలిసిందే. ఎప్పటికప్పుడు కలిసి కనిపిస్తూ నెట్టింట హాట్ టాపిక్‌గా నిలుస్తుంటారు. ఈ ఇద్దరు రిలేషన్‌షిప్‌లో ఉన్నారని చాలా కాలంగా నెట్టింట చర్చ నడుస్తుంది. అయితే దీనిపై మాత్రం అటు రష్మికకానీ, ఇటు విజయ్ దేవరకొండ కానీ సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ వస్తున్నారు. అభిమానుల్లో నెలకొన్న డైలామాకు రష్మిక మందన్నా చెక్ పెట్టేసింది. చెన్నైలో జరిగిన పుష్ప 2 వేడుకలో తన రిలేషన్ షిప్ స్టేటస్‌పై ఓపెన్ అయిపోయింది కన్నడ సోయగం. మీకు ఇష్టమైన వ్యక్తి ఎవరు..? అతడు ఇండస్ట్రీ చెందిన వాడేనా..? అని యాంకర్ అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అతడెవరో అందరికీ తెలుసునని చెప్పింది. రష్మిక సమాధానంతో ఆడిటోరియం అంతా అరుపులు,కేకలతో దద్దరిల్లిపోయింది. విజయ్ దేవరకొండతో ఉన్న రిలేషన్‌షిప్‌పై చాలా కాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు తాజా కామెంట్స్‌తో ఫుల్ స్టాప్ పెట్టేసింది రష్మికమందన్నా. మరోవైపు ఇటీవలే తాను డేటింగ్‌లో ఉన్నానని, ఇప్పుడు తన వయస్సు 35 ఏండ్లు. ఇంకా సింగిల్‌గా ఉండమంటారా..? అందరం ఏదో ఒకటైంలో పెళ్లి చేసుకోవాల్సిందే..అంటూ రిలేషన్‌షిప్ గురించి హింట్ ఇచ్చేశాడు విజయ్ దేవరకొండ. ఈ లెక్కన త్వరలోనే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా పెండ్లిపై క్లారిటీ వచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు సినీ జనాలు.

# హిందీలో రెండో సినిమా..

## ఆ అగ్రిమెంట్‌పై తారక్ సైన్ చేశాడా ఏంటీ?

జూనియర్ ఎన్టీఆర్ యాక్షన్ డ్రామా ప్రాజెక్ట్ వార్ 2తో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో హృతిక్ రోషన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ సినిమా విడుదల కాకముందే తారక్ మరో హిందీ సినిమాకు సంతకం చేశాడన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం యశ్ రాజ్ ఫిలిమ్స్‌తో తారక్ మరో భారీ సినిమా కోసం చర్చలు జరుపుతున్నాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు చెప్పిన కథ తారక్‌కు నచ్చిందట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే 2025 చివరలో ఈ సినిమా లాంచ్ కాబోతుందట. ప్రస్తుతానికి ఆ డైరెక్టర్ ఎవరనేది సస్పెన్స్ నెలకొంది. యశ్ రాజ్ ఫిలిమ్స్ తరచూ స్టార్ యాక్టర్లలో మూడు సినిమాల ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిసిందే. మరి ఎన్టీఆర్ కూడా ఇలాంటి అగ్రిమెంట్‌కు సంతకం ఏమైనా చేశాడా..? అన్నది తెలియాల్సి ఉంది. మొత్తానికి ఏదేమైనా తారక్ త్వరలో హిందీలో రెండో సినిమాకు సైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడన్నది మాత్రం నిజమేనని తాజా వార్తలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. ఆర్ఆర్ఆర్‌తో గ్లోబల్ స్టార్ డమ్ సంపాదించుకున్న తారక్ ఇక హిందీలో కూడా తన సత్తా చూపించాలని డిసైడ్ అయినట్టు తాజా న్యూస్ హింట్ ఇచ్చేస్తుంది.






# లక్కీ భాస్కర్ ఓటీటీలోకి వచ్చేస్తున్నాడు

ఇటీవలే 'లక్కీ భాస్కర్' సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్నాడు మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ బ్యాంకింగ్ సెక్టార్‌లో జరిగే స్కాం నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించాడు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీ ఇక ఓటీటీలో సందడి చేయనుంది. పాపులర్ డిజిటల్ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో నవంబర్ 28న ప్రీమియర్ కానుంది. నెట్‌ఫ్లిక్స్‌లో కూడా తెలుగుతోపాటు ఆయా భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఇంకేంటి మరి థియేటర్‌లో మిస్సయిన వారు ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయండి. ఫస్ట్ డే నుంచి రికార్డు వసూళ్లతో నాలుగో వారం తర్వాత కూడా సక్సెస్‌ఫుల్‌గా స్క్రీనింగ్ అవుతోంది. రూ.100 కోట్లకు వసూళ్లతో దూసుకెళ్తోన్న లక్కీ భాస్కర్ మరి ఓటీటీలో ఎలాంటి ఇంప్రెషన్ కొట్టాస్తాడనేది ఆసక్తికరంగా మారింది. నా పేరు భాస్కర్ కుమార్.. నా జీతం ఆరు వేల రూపాయలు. బార్డర్ లైన్ దరిద్రంలో బతుకుతున్నా.. నేనే కావాలని నన్ను చేసుకుంది నా భార్య సుమతి. నా బలం నా భార్య.. అసలు కథ ఇప్పుడే మొదలైందంటూ.. కాలి గోటి నుంచి తల వరకు ఏది కావాలంటే అది కొనుక్కో.. అంత సంపాదించానంటూ.. అంటూ సాగే డైలాగ్స్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేశాయి. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య తెరకెక్కించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించాడు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613